ఉద్యోగులూ... తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు

- మీ జీతంలో పది శాతం వారి ఖాతాల్లో వేస్తాం
- త్వరలో చట్టం తెస్తాం
- గ్రూప్-1 అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేత కార్యక్రమంలో సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'పిల్లల చదువులు, ఉద్యోగాల సాధన కోసం మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారు. అవసరమైన డబ్బులు ఇచ్చారు. మీ కోసం సర్వం ఒడ్డారు. ఉద్యోగం వచ్చాక తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు. తల్లిదండ్రులను పట్టించుకోకుంటే మీ జీతంలో పది శాతం కోత విధించి వారి ఖాతాల్లో వేస్తాం. త్వరలోనే చట్టం తెస్తాం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు.

శనివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. 563 గ్రూప్-1 పోస్టులకుగాను 562 మంది అభ్యర్థులను టిజిపిఎస్‌సి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. 18 శాఖలకు అభ్యర్థులు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ గడ్డకు చరిత్ర, పౌరుషం ఉందన్నారు. తండాలు, గూడేలు, పల్లెల్లో వీరోచిత గాథలున్నాయని చెప్పారు. ఆరు దశాబ్దాల ఉద్యమాన్ని ఒక కుటుంబానికి, పార్టీకి ఉపయోగించుకోవాలని ఆలోచించారని అన్నారు. ప్రజలు రెండు సార్లు గెలిపిస్తే కారణజన్ములమంటూ అనుకున్నారని గుర్తు చేశారు. ఉద్యోగాలు కల్పించకుండా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకుండా విశ్వాసఘాతకులుగా, నమ్మకద్రోహులుగా మిగిలిపోయారని విమర్శించారు. కాలగర్భంలో కలిసిపోతారని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్నా గ్రూప్-1 నోటిఫికేషన్ వేయలేదన్నారు. ఇంత బాధ్యతారాహిత్యం ఎక్కడైనా ఉంటుందా?, వారు ఉద్యమకారులేనా?అని ప్రశ్నించారు. వారికి ఉద్యమ స్ఫూర్తి ఎక్కడుందని అడిగారు. ఉద్యోగాల భర్తీ కోసం పోటీ పరీక్షలు నిర్వహించాలన్న ఆలోచన చేయలేదన్నారు. టిజిపిఎస్‌సిని అంగడి సరుకుగా మార్చారని అన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్‌ను సభ్యునిగా చేశారనీ, ప్రశ్నాపత్రాలను జిరాక్స్ కేంద్రాల్లో అమ్మారని ఆరోపించారు.

నేను ఉద్యోగాలు అమ్ముకున్నానా...

టిజిపిఎస్‌సిని యుపిపిఎస్‌సి కంటే మెరుగ్గా తీర్చిదిద్దుతామనీ హామీ ఇచ్చామనీ, ఆ దిశగా ప్రక్షాళన చేశామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉన్నత హోదాలో ఉన్న వారిని చైర్మన్లుగా, సభ్యులుగా నియమించామని గుర్తు చేశారు. టిజిపిఎస్‌సి రాజకీయ పునరావాస కేంద్రం కాదని చెప్పారు. కొందరు కడుపు నిండా విషం పెట్టుకుని అభ్యర్థులను దెబ్బతీయాలని అనుకున్నారని వ్యాఖ్యానించారు. మంచి సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రూ.రెండు కోట్లు, మూడు కోట్లకు ఉద్యోగాలు అమ్ముకున్నానని తనపై కొందరు ఆరోపణలు చేశారని చెప్పారు. గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను కలిశానా?, ఛాయ్ అయినా తాగానా? అని అడిగారు. 2023 డిసెంబర్‌లో కూడా ఇంత ఆందోళన చెందలేదనీ, గ్రూప్-1 నియామకాల విషయంలో ఆందోళన చెందానని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల భవిష్యత్తు తెలంగాణ భవిష్యత్తు అని చెప్పారు. ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దేశానికే ఆదర్శంగా తెలంగాణ మోడల్‌ను తయారు చేయాలని కోరారు. ఎన్ని ఆరోపణలు చేసినా నియామకాలు చేపట్టామన్నారు. కోచింగ్ సెంటర్ల కుట్రను అర్థం చేసుకోవాలని అన్నారు. హైకోర్టులో వాదించిన న్యాయవాదుల వెనుక ఎవరున్నారో తెలుసుకోవాలన్నారు. 2011లో గ్రూప్-1 నోటిఫికేషన్ వస్తే 2018లో నియామకాలు జరిగాయని గుర్తు చేశారు. 19 నెలల్లో నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలను పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించిందని చెప్పారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు జిడిపికి మూడు శాతం ఇస్తున్నామనీ, దాన్ని పది శాతానికి పెంచాలని చెప్పారు. రాజకీయాల్లోకి, ఉద్యోగంలోకి కొత్తగా వచ్చినపుడు గరం గరంగా ఉంటారనీ, తర్వాత నరం నరంగా మారతారనీ, ఆ తర్వాత బేషరంగా మారతారని అన్నారు. ఇది తప్పు అని నిరూపించే అవకాశం ఉద్యోగులపై ఉందన్నారు. నిస్సహాయ స్థితిలో ఉండే వారు ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారనీ, ఆ సమయంలో తల్లిదండ్రులు గుర్తుకు రావాలని కోరారు. నిన్నటి వరకు నిరుద్యోగులనీ, ఇప్పుడు అధికారులుగా మారబోతున్నారని చెప్పారు. అందరం కలిసి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల కలలు నిజం కావాలని అన్నారు.

తెలంగాణ రెపరెపలాడాలి : భట్టి విక్రమార్క

తెలంగాణ రెపరెపలాడాలనీ, రైజింగ్ కావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రాన్ని అజేయంగా అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మేధోశక్తిని ప్రపంచానికి చాటుదామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇంత పెద్దఎత్తున నియామకాలు జరగలేదన్నారు. యువకుల పోరాటంతోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామనీ, వారి ఆకాంక్షలను నెరవేర్చడం కోసమే ప్రజాప్రభుత్వం ఉద్యోగాల భర్తీని చేపడుతున్నదని వివరించారు. ఇప్పటి వరకు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. గ్రూప్-1 కొలువుల భర్తీ ఆరంభం మాత్రమేననీ, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. గత పాలకులు అనేక విధాలుగా అవహేళన చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని రాక్షసుల్లాగా అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఓ సంకల్పంతో అభివృద్ధిని ముందుకుతీసుకెళ్తున్నామని అన్నారు. సంపదను అందరికీ సమానంగా పంచడం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. విద్య ద్వారానే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయనీ, ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని వివరించారు. హైదరాబాద్ మహానగరం ప్రపంచానికి తలమానికంగా మారబోతోందన్నారు. ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తామనీ, మూసీ ప్రక్షాళన జరుగుతుందని చెప్పారు. పేద కుటుంబాల నుంచి ఎన్నికైన గ్రూప్-1 అభ్యర్థుల నియామకపత్రాలు అడ్డుకునే వారికి చెంపదెబ్బ కొట్టినట్టుగా ఉందన్నారు.

అవినీతికి పాల్పడొద్దు : సిఎస్

అవినీతికి పాల్పడకుండా నిజాయితీగా ఉద్యోగాలు చేయాలని సీఎస్ రామకృష్ణారావు అన్నారు. గ్రూప్-1 నియామకాల ప్రక్రియ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని చెప్పారు. ఇది అభ్యర్థుల ప్రతిభకు, కష్టానికి నిదర్శనమని వివరించారు. సిఎం, పిఎంలు దిశా, దశ చూపిస్తే సైనికులుగా పనిచేసేది అధికారులు, ఉద్యోగులని అన్నారు. ప్రజా సంక్షేమమే ఉద్యోగులకు పరమావధిగా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపిలు బలరాం నాయక్, అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారులు కె కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, డీజీపీ జితేందర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంతోనే మూసీకి వరదలు

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.150 కోట్ల దోపిడీ కోసమే మూసీ వరదలో ముంచారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆరోపించారు. శనివారం కొడంగల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బిజెపి నాయకులు బిఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు వరద ముప్పును తగ్గించేందుకు వందేళ్ల కిందట నిజాం ప్రభుత్వం నిర్మించిన ఉస్మాన్ సాగర్, గండిపేట చెరువులను వాతావరణ శాఖ హెచ్చరికలు రాగానే ఖాళీ చేసి మూసీ వరద నీటిని నిల్వ చేయాల్సి ఉంటుందని గుర్తుచేశారు. కానీ మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో దోపిడీకి పాల్పడేందుకు ఆ ప్రాజెక్టును ఎలాగైనా పూర్తి చేయాలన్న దురుద్దేశంతో రేవంత్ రెడ్డి ఆ చెరువులను ఖాళీ చేయించలేదని ఆరోపించారు. అందుకే చరిత్రలో తొలిసారిగా ఇమ్లిబన్ బస్టాండ్‌ను వరద ముంచెత్తిందని తెలిపారు.

ఎసిబి వలలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

- రూ.3.50 లక్షల లంచం తీసుకుంటుండగా పట్టివేత
- ఎల్లంపేట మున్సిపాలిటీలో ఘటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి రూ.3.50లక్షలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కాడు. ఎసిబి, డిఎస్‌పి హైదరాబాద్ రేంజ్ అధికారి గంగసాని శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సోమారం గ్రామంలో మూడేండ్ల కిందట ఏర్పాటు చేసిన గంగస్థాన్ వెంచర్‌కు నిర్వాహకులు హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకున్నారు. అయితే, పక్కన ఉన్న భూ యజమానులకు రాకపోకలు కొనసాగించడానికి వీలుగా రోడ్లు ఉండాలని నిబంధన ఉంది. కానీ వీరు రోడ్ల వద్ద గేట్లు ఏర్పాటు చేశారు. దీనిని ఆసరా చేసుకున్న టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి ఎస్.రాధాకృష్ణారెడ్డి వెంచర్ నిర్వాహకులను రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకపోతే గేట్లు తొలగిస్తానని, ప్రహరీ కూల్చేస్తానని బెదిరించాడు. దాంతో యజమానులు వారం రోజుల కిందట సదరు అధికారికి లక్ష రూపాయలు ముట్టజెప్పారు. శనివారం మరో రూ.3.50 లక్షలు ఇవ్వడానికి బాధితులు ఫోన్ చేయగా కొంపల్లిలోని రాయిచందని మాల్ వెనుకకు రావాలని టౌన్‌ప్లానింగ్ అధికారి సూచించాడు. బాధితుడు అక్కడికి వెళ్లగా డబ్బుల బ్యాగ్‌ను కారు డాష్ బోర్డులో పెట్టించుకున్నాడు. ఇంతలోనే ఎసిబి అధికారులు రంగంలోకి దిగి లంచం తీసుకున్న అధికారిని పట్టుకుని ఎల్లంపేట మున్సిపాలిటీకి తరలించారు. అనంతరం అతని ఇంట్లో, మున్సిపల్ కార్యాలయంలో సోదాలు చేశారు. కేసు విచారిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు.

భారీగా ఐపిఎస్‌ల బదిలీలు

- హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సి.వి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ ఎత్తున ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో డిజిపి స్థాయి నుంచి ఎస్‌పి స్థాయి అధికారుల వరకు ఉన్నారు. నగర పోలీసు పగ్గాలను వి.సి సజ్జనార్‌కు, ఇంటెలిజెన్స్ బాధ్యతలను విజయ్ కుమార్‌కు, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను సి.వి ఆనంద్‌కు అప్పగించిన ప్రభుత్వం.. ఎసిబి పగ్గాలను చారుసిన్హా చేతికి ఇచ్చింది. అలాగే ఆర్‌టిసి ఎండి బాధ్యతలను వై.నాగిరెడ్డికి అప్పగించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చీఫ్‌గా శిఖా గోయెల్‌ను నియమించింది. మొత్తమ్మీద 23 మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేసింది.

జడ్‌పి రిజర్వేషన్లు ఖరారు

- ఎస్‌టిలకు 4, ఎస్‌సిలకు 6, బిసిలకు 13

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జడ్‌పి చైర్మన్, చైర్‌పర్సన్ల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్‌ను రాష్ట్ర సర్కారు విడుదల చేసింది. ఎస్‌టిలకు నాలుగు, ఎస్‌సిలకు ఆరు, బిసిలకు 13, జనరల్ కేటగిరికి ఎనిమిది జడ్‌పి పీఠాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నది. 15 జిల్లాలను మహిళలకు కేటాయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం, వరంగల్ (ఎస్‌టి), ములుగు, నల్లగొండ (ఎస్‌టిమహిళ)కు కేటాయించబడ్డాయి. ఎస్‌సి మహిళలకు రంగారెడ్డి, హన్మకొండ, జనగామ, ఎస్‌సి జనరల్ కేటగిరిలో జోగులాంబ గద్వాల, రాజన్నసిరిసిల్ల, సంగారెడ్డి జడ్‌పి పీఠాలను ఖరారు చేశారు. బిసి జనరల్ కేటగిరీలో జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కొమ్రంభీం అసిఫాబాద్, నిర్మల్, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాలున్నాయి. బిసి మహిళల కోటాలో మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాలున్నాయి. జనరల్ మహిళ కేటగిరీలో ఆదిలాబాద్, జగిత్యాల, నారాయణపేట, పెద్దపల్లి, జనరల్ కోటాలో భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్ జిల్లాలున్నాయి. ఎంపిటిసి, ఎంపిపి, జడ్‌పిటిసిల రిజర్వేషన్ల వివరాలను జిల్లాల వారీగా విడుదల చేశారు.

పెండింగ్ బిల్లులు, జీతాలు చెల్లించాలని సర్కారు నిర్ణయం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ నాటికి గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను చెల్లించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకున్నది. ఎంపిడబ్ల్యూఎస్‌కు సంబంధించిన జులై నెల వేతనాలను విడుదల చేస్తున్నట్టు రాష్ట్ర సర్కారు ప్రకటించింది. దానికి సంబంధించిన రూ.49 కోట్లు సోమవారం నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది జులై, ఆగస్టు నెలల జీతాలను కూడా ఆర్థిక శాఖ విడుదల చేసింది. మొత్తం రూ.19 కోట్లు సోమవారం నాటికి నరేగా ఉద్యోగుల ఖాతాల్లో పడనున్నాయి. పలు కారణాలతో పెండింగ్‌లో ఉన్న బిల్లులను రాష్ట్ర సర్కారు విడతలవారీగా క్లియర్ చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. గ్రామపంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేసే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉన్నట్టు తెలుస్తోంది. మాజీ సర్పంచుల బిల్లులు పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉండటంతో వాటిని విడతల వారీగా విడుదల చేసే ఆలోచనలో సర్కారు ఉంది.

మంజీర బ్యారేజీకి భారీ వరద

- రెండ్రోజులపాటు హైదరాబాద్‌కు నీటి సరఫరా బంద్
- మూసీకి వరదతో హైదరాబాద్‌లో ముంపు సమస్య
- వాటర్ బోర్డు సిఎండి అశోక్ రెడ్డి
- నీట మునిగిన పెద్దాపూర్ వాటర్ పంపుహౌజ్ పరిశీలన

విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మంజీరా బ్యారేజీకి 25 ఏండ్ల తర్వాత భారీగా స్థాయిలో వరద వచ్చిందని హైదరాబాద్ వాటర్ బోర్డు సిఎండి అశోక్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేస్తున్న పంపుహౌజ్ మునిగిపోవడంతో శనివారం పరిశీలనకు వచ్చిన సిఎండి అశోక్‌రెడ్డి సంగారెడ్డిలోని ఐబిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సదాశివపేట మండల పరిధిలోని పెద్దాపూర్‌లో ఉన్న వాటర్ ఫిల్టర్ బెడ్‌కు భారీఎత్తున వరదల రావడంతో పంపు హౌజ్ పూర్తిగా నీటిలో మునిగిపోయిందన్నారు. పంపు హౌజ్ పక్క నుంచి మూడు వరద కాలువలు ప్రవహించి ఒకే దగ్గర కలుస్తాయని చెప్పారు. రెండ్రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆ మూడు కాలువలకు పెద్దఎత్తున వరద నీరు రావడంతో అవి ఒకే దగ్గర కలిసి రెండు మీటర్లు ఎత్తు ఉన్న పిల్టర్ బెడ్ గోడను దాటుకుని పంపు హౌజ్‌లోకి నీరు చేరిందన్నారు. ఈ సారి ఎన్నడూ రానంతగా వరదలు వచ్చాయన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 600 ఎంజీడీ నీరు అవసరం ఉంటుందని, ఈ పంపు హౌజ్ మునగడం వల్ల 34 ఎంజిడి నీరు ఆగిపోతుందన్నారు. కేవలం పంపుహౌజ్ మాత్రమే మునిగిపోయిందని, పక్కనే సబ్ స్టేషన్ ఉన్నా అందులోకి నీరు రాలేదన్నారు. నీరు వచ్చిన వెంటనే మోటర్లను ఆపేశారని, దాంతో ఎలాంటి నష్టం జరుగలేదన్నారు. వరద తగ్గిందని, రెండ్రోజుల్లో మోటార్లు బాగు చేయించి యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. మూసీ నదికి వరదలు పెరగడం వల్లే హైదరాబాద్‌లో మునిగి కొన్ని ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు వచ్చిందని తెలిపారు. వికారాబాద్ జిల్లాలో వర్షాలతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లకు భారీగా వరద వచ్చిందన్నారు. 2020 తర్వాత ఇప్పుడు మళ్లీ ఈ స్థాయి వరద రావడం ఇదే తొలిసారి అన్నారు. రెండు రిజర్వాయర్ల నుంచి ఒకేసారి 35 వేల క్యూసెక్కుల వరద కిందికి వదలడంతో మూసీ నది ఉధృతి మరింత పెరిగిందన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను, అధికారులను అప్రమత్తం చేశామని, ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఇన్ ఫ్లో తగ్గిందని తెలిపారు. హైడ్రా, పోలీసు శాఖ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జీఎం రామకృష్ణ, సిజిఎం బ్రిజేష్ తదితరులు ఉన్నారు.

ప్రశంసలతో పాటు విమర్శలు స్వీకరిస్తాం

- మెట్రోలో ప్రయాణించిన మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం మెట్రో రైలులో ఆకస్మికంగా ప్రయాణించారు. నగరవాసుల "మెట్రో" అనుభవాలను స్వయంగా తెలుసుకునేందుకు సాధారణ ప్రయాణికుడిలా టికెట్ కొని, తూర్పున ఉన్న నాగోల్ స్టేషన్ నుంచి పశ్చిమాన ఉన్న ఐటీ కారిడార్ రాయదుర్గం వరకు ప్రయాణించారు. మెట్రో సేవలు, సౌకర్యాలు, స్టేషన్లలో భద్రత, రవాణా సవాళ్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన రవాణాను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది అని ఈ సందర్భంగా అన్నారు. నగరంలో ప్రజా రవాణా బలోపేతానికి ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలు, మెట్రో ఫేజ్-2 విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్, ఇతర భవిష్యత్ ప్రణాళికలను ప్రయాణికులకు వివరించారు. వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. తమ ప్రభుత్వం. ప్రశంసలతో పాటు... విమర్శలను స్వీకరిస్తుందని చెప్పారు.

మూసీ గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎగువ ప్రాంతాల్లో ఉన్న హైదరాబాద్‌లోని ఉస్మాన్‌సాగర్, హుస్సేన్‌సాగర్ రిజర్వాయర్ల నుంచి పెద్దఎత్తున వరద వస్తుండటంతో మూసీ ప్రాజెక్టు ఎనిమిది గేట్లను ఎత్తారు. శనివారం నల్లగొండ జిల్లా కేతెపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు 2, 3, 4, 5, 6, 7, 8, 10, 12 నెంబర్ల క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు 44922.31 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 643.10 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.46 టిఎంసిలుగా కాగా ప్రస్తుతం 3.96 టిఎంసిల నీరు నిలువ ఉంది.

పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షిస్తున్నామని డ్యామ్ ఇంజినీర్లు డిఇ చంద్రశేఖర్, ఎఇ మమత, ఉదయ్ కుమార్, మధు చెప్పారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు
O.S. No. 32/2017
Between :
అబ్బిరెడ్డి రామ్‌ప్రకాష్ ...ప్లయిన్‌టిఫ్
మరియు
1) పల్లా వరలక్ష్మి (died)
2) పల్లా సత్యారావు (died), **వగైరాలు**
...డిఫెండెంట్లు
D_3 - పల్లా సత్యసంతోష్ కుమార్, S/o. లేటు సత్యారావు, C/o. సురేష్ రెన్డల అపర్ణరెడ్డి, హచ్.నెం.2-6-1049/1, రోడ్ నెం.2, స్ట్రీట్ నెం.6, డెపొడిల్స్ హైస్కూల్ ప్రక్కన, కె.ఎల్.ఎన్.రెడ్డి కోలనీ, వరంగల్, తెలంగాణ స్టేట్.
D_4 - ధౌలూరి యశోద, W/o. కుమార్, ఫ్లాట్ నెం.501, డోర్.నెం.4-59-17/12, శ్రీ సాయి సంపత్ అపార్ట్‌మెంట్స్, లాసన్స్‌బే కోలనీ, విశాఖపట్నం.
D_5 - పల్లా సరితారమణి, W/o. (లేటు) విజయ్, ఉద్యోగస్తురాలు, డోర్.నెం.3-42/3, పంచాయితీ ఆఫీసు ప్రక్కన, జార్జిపేట, నీలపల్లి గ్రామం, తాళ్ళరేవు మండలం, కాకినాడ జిల్లా.
పై దావాలో మీరు D3, D4 మరియు D5 అయ్యివున్నారు. పైన తెలిపిన దావాలో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన దావా **ది. 14-10-2025 సం॥** తేదీన వాయిదా అయ్యివున్నది. కావున పై తేదీన, పైన తెలిపిన కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

IN THE COURT OF THE DISTRICT MUNSIF, TIRUVALLUR
I.A. No. 14/2024
in
O.S. 158/1989
Between:
I. Mallikarjuna Sharma, S/o Venkataramanaiah, 6-3-1243/156, Hyderabad-500082, Telangana.
...Petitioner/7 th Plaintiff
AND
1. Chandrasekhar, N., S/o I. Lalitha and Maj. N.V. Krishnamurthy, G-8, AWHO Colony, Sector C, Sikh Road, Secunderabad-500009.
...9 th Respondent/ 10 th Plaintiff
2. Cdr. M.V. Vasudevan, S/o M. Venkatramayya, G-505, Jala Vayu Towers, Gandhinagar, Hyderabad-500080.
...R-19/D-28 Defendant
3. Lalitha (DIED), W/o U. Krishnamoorthy, 106, Jyothi Kailash Society, Satellite Nagar, AHMEDABAD – 380015.
R-28/D-19 Also in the same Court
Between:
I. Mallikarjuna Sharma, S/o Venkataramanaiah, 6-3-1243/156, Hyderabad-500082, Telangana.
Petitioner/7 th Plaintiff
AND
1. M. MADHAVI (DIED), w/o M. Lakshmikantam, 2-2-1123/1, New Nallakunta, Hyderabad – 500 044. -
R-23/D-12
2. Dr. M. SADASIVAIAH (DIED), S/o late M. Sundaresam, No. 1-9-295/13/A/2, Vidyanagar, Hyderabad-500044 –
R-42/D-33
3. M. SARADA, D/o late M. Sundaresam, 11-70, S.V. Nagar, Tirupati.
R- 44/D-35
4. M. VENKATESWARLU (DIED), S/o late M. Sundaresam, C/o Ms. Subbu Lakshmi, PP Reddy Retirement Homes, Plot No: 41, RCI Rd, beside Recover Hospitals, Mallapur, V, Balapur, Hyderabad, Telangana 500005.
R- 45/D-36
5. M. SUGUNAMMA, W/o C. Seshaiah, C1-308 Aditya Sunshine Apartments, Shilpa Hills, Hanuman Nagar, Kondapur, Hyderabad, Telangana 500084.
R-47/D-38
6. M. ARAVIND, S/o late M. Sundaresam, 506 A Block, Ramkey 1 Marvel, Gajula Ramaram, Kukatpalli, Hyderabad.
R-48/D-39
7. P. Viswanadham, S/o P. Subramanyam, Flat No. 202, Tirumala Gardens, Rangaraju Lane, Opp. Barishta, Road No. 1, Banjara Hills, HYDERABAD - 500 034.
R- 50/D-41
8. P. Anuradha, W/o Venugopal, Kukatpalli, HYDERABAD - 500 034.
R-51/D-42
9. M. Sujatha, W/o late M.V. Krishnaswamy, Champaka, Plot No. 10, Road No. 4, Alkapuri, S.R.K. Puram, Hyderabad - 500 035.
R-52/D-43
10. U. Archana, D/o late M.V. Krishnaswamy, Champaka, Plot No. 10, Road No. 4, Alkapuri, S.R.K. Puram, Hyderabad - 500 035.
R-53/D-44
* * *
NOTICE TO RESPONDENTS 9, 19 & 28 and to RESPONDENTS 23, 42, 44, 45, 47-48, 50-53:
Please take notice that in the above final decree petition, IA No. 14/24, the Hon'ble Court was pleased to order Notice to Respondents. Hence You are hereby called on to enter appearance on **10-10-2025** at 10.30 a.m. in the above stated Court either in person or through an advocate if you have any objection; otherwise, the petition will be decided ex partie in your absence.
Dr. M. Thanigaivel & M. Padmini,
Advocates.
70 Gandhi Road, Tiruvallur-602001.
Mob: 9443640888 & 9443521985.

అభివృద్ధి పేరుతో భూములు గుంజుకుంటారా?

- ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలి
- మార్కెట్ ధరకు మూడింతల పరిహారం చెల్లించాలి
- సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పేదలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతుల ప్రమేయం లేకుండా అభివృద్ధి పేరుతో ట్రిబుల్ ఆర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూములను గుంజుకోవాలని అనుకోవడం సరికాదని సిపిఎం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రూ. కోట్లు విలువ చేసే భూములకు లక్షల పరిహారం చెల్లింపులు సరికాదని, ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలని కోరుతూ.. శనివారం సంగారెడ్డి, మెదక్, భువనగిరి, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ల ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో భూనిర్వాసితులు ధర్నాలు చేశారు. ర్యాలీలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

సంగారెడ్డిలోని కేకే భవన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు మాట్లాడుతూ.. భూముల ధరలకు సంబంధం లేకుండా ప్రభుత్వం నామమాత్రంగా పరిహారం ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాల కోసం భూములు తీసుకోవాల్సి వస్తే.. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు జరపాలన్నారు. ప్రయివేట్ అవసరాలకు అయితే 70 శాతం మంది, ప్రభుత్వ అవసరాల కోసం 80 శాతం మంది ఆమోదిస్తేనే అక్కడ భూసేకరణ జరపాల్సి ఉంటుందని, కానీ ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. దీనిపై రైతులకు అండగా సిపిఎం, ప్రజాసంఘాలు పోరాడుతాయని స్పష్టం చేశారు. ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రీయంగా ఉండాలని, ఏండ్ల నుంచి భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతులను కన్నతల్లిలాంటి ఆ భూముల నుంచి వేరు చేయడంలో ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. మెదక్ జిల్లా కేంద్రంలోనూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అజ్జమర్రి మల్లేశం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అడిషనల్ కలెక్టర్ నగేష్‌కి వినతిపత్రం అందజేశారు.

భువనగిరిలో..

భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ చౌటుప్పల్, నారాయణపురం మండలాల గుండా వెళ్తున్న ట్రిబుల్‌ఆర్ కొత్త అలైన్‌మెంట్‌ను మార్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రిబుల్‌ఆర్ భూనిర్వాసితులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గతంలో భువనగిరి, మునుగోడు ఎమ్మెల్యేలు భూనిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం రాజీనామా చేయడానికి సిద్ధమా అని జహంగీర్ ప్రశ్నించారు. ప్రభుత్వం ముందు ప్రకటించిన అలైన్‌మెంట్ కాకుండా దాన్ని 28 కిలోమీటర్లు కుదించడం వల్ల పట్టణ, మండల కేంద్రాలకు చేరువలో ఉన్న సారవంతమైన భూములను రైతులు కోల్పోతున్నారన్నారు.

నల్లగొండలో..

రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవద్దని సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్దలు, పలుకుబడి కలిగిన వారు, పెత్తందారుల భూముల జోలికి వెళ్లకుండా అలైన్‌మెంట్‌ను మార్చారని ఆయన విమర్శించారు.

రంగారెడ్డిలో..

రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూబాధిత రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భూబాధితులు ధర్నా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చడంతో పెద్ద మొత్తంలో సన్న, చిన్నకారు పేద రైతులు తమ భూములను కోల్పోతున్నారని పగడాల యాదయ్య తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో తలకొండపల్లి, మాడ్గుల, కేశంపేట్, కొందుర్గు, ఫరూక్‌నగర్ మండలాల్లో రైతులు తమ భూములు కోల్పోతున్నారని తెలిపారు.

మహబూబ్‌నగర్‌లో..

ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం ఆగదని సిపిఎం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఏ.రాములు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట భూబాధితులు ధర్నా చేశారు. బాలనగర్ మండలంలో ట్రిబుల్‌ఆర్ రింగ్ రోడ్ ఉత్తర్వులను రద్దు చేసే వరకూ పోరాటం ఆగదన్నారు. ఈ ప్రాంతంలో చిన్న, సన్నకారు రైతులు వారికున్న ఎకరా, అర ఎకరా భూములు కోల్పోయి రోడ్డున పడతారన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, డిమాండ్ చేశారు

అబ్కారి శాఖకు గుర్తింపు తీసుకురండి

- తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాలని గ్రూప్-1 ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఆ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆయనను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ... ప్రభుత్వ విభాగాలన్నింటిలోనూ అబ్కారి శాఖ ముఖ్యమైనదని అన్నారు. ఈ శాఖలో పని చేసే వారికి యూనిఫాం సర్వీస్ గుర్తింపుతో పాటు, ప్రోటో కాల్ జాబ్‌గా గుర్తింపు ఉంటుందని గుర్తు చేశారు. శిక్షణలో నిత్యం ఎక్సైజ్ చట్టాలను చదవడం, ఫీల్డ్ వర్క్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. డ్రగ్స్, గంజాయి, లిక్కర్ తయారీ డిస్టలరీ మొదలగు అన్ని రకాల విధులను నిర్వహించడంలో చురుగ్గా పని చేయాలని సూచించారు. అపాయింట్‌మెంట్ లేటర్ అందుకున్న తర్వాత 60 రోజుల్లో ఎప్పుడైనా విధుల్లో చేరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, జాయింట్ కమిషనర్ రాథోడ్ సురేష్, అసిస్టెంట్ సెక్రటరీ నాగలక్ష్మి, ఓఎస్ ఓమర్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులు బాగుండాలి : కవిత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కోసం విదేశాలకు వలస వెళ్లిన కార్మికులు బాగుండాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. తెలంగాణ జాగృతి ఖతార్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బతుకుదెరువు కోసం విదేశాలకు వచ్చిన వారు కుటుంబాలకు దూరంగా పడుతున్న కష్టం తనకు తెలుసని చెప్పారు. వారంతా తిరిగి తెలంగాణకు వచ్చినా, అక్కడే ఉన్నా వారి సంక్షేమం ముఖ్యమని తెలిపారు. జీవితంలో కొన్ని సందర్భాలు వస్తాయనీ, యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు మనోడైనా, మందోడైనా సరే న్యాయం, ధర్మం ఎటువైపు ఉందో చూడాలని ఆమె కోరారు. తెలంగాణ హక్కుల రక్షణ, రాష్ట్ర ప్రజల కోసం పోరాడటమే ఊపిరిగా పని చేస్తానని కవిత తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- అపార్ట్‌మెంట్ తరహాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, పేదలు ఆత్మగౌరవంగా బతికేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజాప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, గ్రామాల్లో పనులు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు జరుగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురలోని నారాయణ జోపిడి సంఘం వద్ద రూ.22.32 కోట్లతో ఐదుబ్లాక్‌లుగా నిర్మించిన 288 డబుల్‌బెడ్ రూం ఇండ్లను శనివారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు ఈటల రాజేందర్, అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్ హరిచందన, ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులతో కలిసి మంత్రి ప్రారంభించారు. లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పరిధిలో గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలేసిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లను యుద్ధప్రాతిపదిక పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పేదలకు త్వరలో ఇండ్ల మంజూరు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు అపార్ట్‌మెంట్ తరహా ఇండ్లను అందించేలా తియ్యటి కబురు చెబుతామని అన్నారు.

పట్టణ ప్రాంతాల్లో 30 నుంచి 70 గజాలున్నాసరే స్థానికంగా నివసించే వారికి అపార్ట్‌మెంట్ తరహాలో ఇండ్లను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేసి ఇస్తామని మాట ఇచ్చానని దానిని నెరవేర్చామని స్పష్టం చేశారు. నాటి ప్రభుత్వంలో పేదలకు అన్యాయం చేశారని, ఏడాదికి లక్ష ఇండ్లు కట్టినా పదేండ్లలో పది లక్షల ఇండ్లు పేదలకు వచ్చేవన్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా తొలి విడతగా 4.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి సంకల్పించిందన్నారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే గణేష్ ప్రస్తావించిన అంశాల మేరకు వాజ్‌పేయి కాలనీలో మొండిగోడలతో ఉండిపోయిన ఇండ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు ఇచ్చేలా మంత్రి అధికారులను ఆదేశించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో సౌకర్యాలతో కూడిన శ్మశానవాటిక నిర్మిస్తామని, ఈ విషయంలో కేంద్రం నుంచి అనుమతుల సాధించాలని ఎంపీ రాజేందర్‌ను కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నారాయణ జోపిడి వాసులకు దసరా పండుగ ముందుగానే వచ్చిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇండ్ల పట్టాలు అందుకుంటున్న లబ్దిదారులకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ బడుల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు స్థలాలు

- సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో అమ్మకానికి పెట్టిన హౌసింగ్ బోర్డు స్థలాలను ప్రభుత్వ పాఠశాలల నిర్మాణానికి ఉపయోగించాలని తెలంగాణ పౌర స్పందన వేదిక (టిపిఎస్‌వి) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం నర్సిరెడ్డితోపాటు టిపిఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం లేఖ రాశారు. ఆయా మండలాల్లోని హౌసింగ్ బోర్డుకు సంబంధించిన ఆరు స్థలాలను నోటిఫికేషన్ 11 ద్వారా అమ్మకానికి పెట్టారని తెలిపారు. కుత్బుల్లాపూర్ మండలంలో 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలుంటే, 166 ప్రయివేటు పాఠశాలలున్నాయని వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు అందుబాటులో లేక చాలా మంది తల్లిదండ్రులు ప్రయివేటు ఉన్నత పాఠశాలలకు తమ పిల్లలను పంపిస్తున్నారని పేర్కొన్నారు. అమ్మకానికి పెట్టిన ఒక స్థలం పాఠశాలకు పనికి వస్తుందని నోటీసులో పేర్కొన్నారని గుర్తు చేశారు. ఆ స్థలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మిస్తే కనీసం వెయ్యి మందికిపైగా విద్యార్థులకు చదువు అందించొచ్చని తెలిపారు. మహేశ్వరం మండలంలో 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 30 ప్రయివేటు ఉన్నత పాఠశాలలున్నాయని వివరించారు. ఈ మండలంలో నాలుగు స్థలాలు అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఏదో ఒక స్థలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ రంగంలో అదనంగా ప్రభుత్వ పాఠశాలలు స్థాపించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలను పాఠశాలల స్థాపనకు కేటాయించాలని కోరారు.

సుప్రీంకోర్టు సిజెఐపై అనుచిత వ్యాఖ్యలు

- కారకులపై చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సుప్రీం కోర్టు సిజెఐపై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దళితుడు ఉండటాన్ని జీర్ణించుకోలేని న్యాయవాదులు మురళీమోహన్ రావు, ప్రొద్దుటూరు శ్రీకాంత్ అగ్రకుల దురహంకారంతో అనుచిత వ్యాఖ్యలు చేయటం తగదని హితవు పలికారు. దీన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం ప్రకారం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ నుండి న్యాయవాదుల లైసెన్‌ను రద్దు చేయాలని కోరారు.

మాతృత్వంలో సమతుల ఆహారం తీసుకోవాలి

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాతృత్వంలో ఆహారపు అలవాట్లు, సమతుల ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరళ్ల శారద అధ్యక్షతన బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'మాతృత్వం, ఆరోగ్యం'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బతుకమ్మ పండుగ మనలను ప్రకృతికి దగ్గర చేస్తుందని రంగనాథ్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో హైడ్రా ఎస్‌పి అడ్మిన్ , కమిషన్ సెక్రటరీ పద్మజ రమణ, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నిండుకుండలా జంట జలాశయాలు

- గండిపేట్ 12, హిమాయత్ సాగర్ 11 గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలు కారణంగా జంట జలాశయాలు నిండుకున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద రావడంతో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. దాంతో గండిపేట్ 12 గేట్లు, హిమాయత్‌సాగర్ 11 గేట్లను అధికారులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. గండిపేట్ గేట్లు ఎత్తడంతో నార్సింగి అవుటర్ సర్వీస్ రోడ్డు, మంచిరేవుల గ్రామానికి వెళ్లే రహదారిని పూర్తిగా మూసేశారు. వాహనదారులు ఇటువైపు రావద్దంటూ పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. బండ్లగూడ కార్పొరేషన్ హైదర్‌షాకోట్ ఐదో వార్డు సాయిరాంనగర్‌లో మూసీ వరద పెద్దఎత్తున వచ్చింది. హనుమాన్ టెంపుల్, సాయిబాబా గుడి పూర్తిగా నీట మునిగాయి. మున్సిపాలిటీ అధికారులు, మాజీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలను అక్కడి నుంచి తరలించారు. మూసీ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్లు సూచించారు.

భూసేకరణలో కార్మికులు, వృత్తిదారులకు పరిహారం

- ఎఐఎడబ్ల్యుయు అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భూసేకరణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులకు పరిహారం చెల్లించాలని ఎఐఎడబ్ల్యుయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర సమావేశాలు అధ్యక్షులు నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... పేదల అనుభవంలో ఉన్న భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించాలనీ, గ్రామసభ ఆమోదం లేకుండా భూముల జోలికొస్తే ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ట్రిబుల్ ఆర్, రైల్వేలైన్, హైవే రోడ్లు, ఫార్మా సిటీ పేరుతో జరుగుతున్న భూసేకరణ ప్రాంతాల్లో సామాజిక సర్వే చేయాలనీ, వ్యవసాయ భూముల ఆధారంగా బతికే వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు, ఇతర పేదలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాస ప్యాకేజీ ఇవ్వాలనీ, పేదల అనుభవంలో ఉన్న అసైన్‌మెంట్ భూములు, బంజరు, ఇనాం, దేవాదాయ, భూదాన, ఫారెస్ట్ భూములకు పట్టా భూములతో సమానంగా మార్కెట్ రేటు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న భూసేకరణలో పోరాడి పేదలు సాధించుకున్న భూములను పాలకులు లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల, రియల్ ఎస్టేట్‌దారుల భూములను రక్షించడం కోసం ఎలైన్‌మెంట్‌ను ఇష్టం వచ్చిన రీతిలో మారుస్తున్నారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇవ్వాలనీ, ఇంటికొకరికి ఉద్యోగం కల్పించాలనీ, 18 ఏండ్లు నిండిన వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులకు 20 ఏండ్ల పాటు రూ. రెండు వేల చొప్పున పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు మాత్రమే మొదటి ప్రాధాన్యతగా సేకరించాలని చట్టంలో ఉందన్నారు. అవసరమయితే తప్ప మొదటి పంట, రెండు పంటలు పండే భూములు జోలికి పోకూడదనీ, భూసేకరణ జరగాలంటే గ్రామసభలో 80 శాతం మంది ప్రజలు ఒప్పుకుంటేనే భూములు సేకరించే అధికారం కలెక్టర్‌కు ఉందని తెలిపారు. కానీ బ్యాంకులో డబ్బులు వేస్తాం, భూములు బలవంతంగా లాక్కుంటామని అధికారులు, కలెక్టర్లు మాట్లాడటం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీవర్షాలు, వరదలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసిన పంటలు నష్టపోయాయనీ, ఎకరాకు రూ. 20 వేలు నష్టపరిహారమివ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. 2025 వానాకాలంలో అధిక వర్షాల వల్ల ఇప్పటి వరకు మూడు లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, పప్పు, తృణధాన్యాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వీటికి ఎకరాకు రూ.పదివేలు ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ, గతేడాది ఐదు లక్షల ఎకరాల్లో అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోగా మే లో రైతులకు రూ.51,253 కోట్లు, ఎకరాకు రూ. పదివేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించారని తెలిపారు. కానీ, ఆ పరిహారం పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. గత రెండేండ్లుగా అధిక వర్షాల వల్ల సగటున ఐదు లక్షల ఎకరాల చొప్పున పంటలు నష్టపోతున్నాయని తెలిపారు. వీటితో పాటు రోడ్లు, గ్రామపంచాయతీ ఆస్తులు, మున్సిపల్ ఆస్తులకు నష్టం జరుగుతున్నదని పేర్కొన్నారు. అనేక మంది ఇండ్లు కోల్పోయి నిర్వాసితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారం లేకపోవడంతో ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టాలు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాల పరిహారం కింద 15వ ఆర్థిక సంఘం 2021-25 సంవత్సరాల కాలానికి రాష్ట్రానికి రూ.2,483 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.827 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో 2025-26 సంవత్సరానికి రూ.546 కోట్లు కేంద్రం, రూ.182 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, మొత్తం రూ. 726 కోట్లు కేటాయించాయని పేర్కొన్నారు. కనీసం ఈ నిధుల పంపిణీ కూడా సరిగ్గా జరగలేదని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల పరిహారం కోసం సర్వే చేసి, గణాంకాలు సేకరించడానికి రెవెన్యూలో ఒక శాఖ కూడా ఉందనీ, కానీ ఆ శాఖ పని చేయడం లేదని ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 20 వేలు, పాక్షికంగా ఇండ్లు నష్టపోయిన వారికి తాత్కాలికంగా ఆదుకుని వారికి ఇండ్లు మంజూరు చేయాలని జూలకంటి డిమాండ్ చేశారు. వరదల వల్ల వచ్చే జబ్బులను నివారించడానికి వరద ప్రాంతాల్లో మొబైల్ వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.

అయ్యో.. బయో..!

- బహిరంగ ప్రదేశాల్లో బయో వ్యర్థాలు
- గృహ వ్యర్థాలతోపాటే పడేస్తున్న క్లినిక్‌ల నిర్వాహకులు
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు
- ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్‌లపై తనిఖీలు, చర్యలు శూన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల నిర్వాహకులు జీవ వ్యర్థాలను విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. గల్లీలు, మున్సిపాల్టీలు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. గృహ వ్యర్థాలతోపాటే బయో వ్యర్థాలనూ పడేస్తుండటంతో చెత్త కుప్పలు, డంపింగ్ యార్డుల వద్ద పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తొలగించే, సేకరించేవారు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్‌లపై ఎప్పటికప్పుడూ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేసి, చర్యలు తీసుకోకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గృహ వ్యర్థాలతోపాటే..

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చిన్న చిన్న క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. బయో వ్యర్థాలు సైతం పెద్ద మొత్తంలో పోగవుతున్నాయి. ఆయా సెంటర్లలో వాడిన సిరంజీలు, సెలైన్ బాటిళ్లు, సూదులు, గాయాలకు డ్రెస్సింగ్ చేసిన దూది, మూత్రపు పైపులు, మాస్కులు, చేతి గ్లౌజులు తదితర వ్యర్థాలను పెద్ద మొత్తంలో బహిరంగ ప్రదేశాలు, చెత్త కుప్పలు, డంపింగ్ యార్డుల్లో పడేస్తున్నారు. రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా మున్సిపల్ చెత్త కుప్పలు, నిర్మానుష్య ప్రదేశాల్లో పడేసి వెళ్తున్నారు. ఆ మూటల్లో ఏముందో తెలియకపోవడంతో మున్సిపాల్టీ సిబ్బంది వాటిని కూడా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, గల్లీలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల నుంచి వచ్చే వ్యర్థాలను విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాలు, పురపాలక చెత్త వ్యాన్లలోనూ పడేస్తున్నారు. చాలాచోట్ల ఇంట్లోనే క్లినిక్‌లు నిర్వహిస్తుండటంతో బయో వ్యర్థాలను కూడా గృహ వ్యర్థాలతో కలిపి డస్ట్ బిన్ కవర్ల ద్వారా చెత్త బండ్లలో వేస్తున్నారు. దీంతో చెత్తను తొలగించే వారు, సేకరించేవారు ప్రాణాంతక వ్యాధుల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా కాలుష్య నియంత్రణ మండలి, పురపాలక అధికారులు తమకు ఏమీ తెలియనట్టుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

నిబంధనలకు తూట్లు..!

క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల నుంచి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల దాకా బయో మెడికల్ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించాలి. నిబంధనలు పాటించని సెంటర్లపై మున్సిపాల్టీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. జీవ వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు- 2016 ప్రకారం సురక్షితంగా, శాస్త్రీయంగా నిర్వహించాల్సి ఉన్నా.. కొన్ని క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. గృహ వ్యర్థాలతోపాటే పారబోయడం వల్ల బయో మెడికల్ వ్యర్థాల్లో ఉండిపోయిన కొన్ని రకాల బ్యాక్టీరియా, వైరస్ వల్ల చెత్తను తొలగించే సిబ్బంది వ్యాధుల బారిన పడే పరిస్థితి ఏర్పడుతోంది. బయో వ్యర్థాలు గాలి, నీటిలో కలిసిపోవడం వల్ల కాలుష్యం ఏర్పడి ప్రాణాంతక వ్యాధులు సైతం వచ్చే అవకాశాలున్నాయి. పారిశుధ్య కార్మికులు వీటిని తొలగించే క్రమంలో సూదులు, ఫ్లోర్ సిప్పులు గుచ్చుకుని ఇన్ఫెక్షన్ల బారినపడే ప్రమాదముంది. వాటిని తొలగించే క్రమంలో సిబ్బందికి హెపటైటిస్, హెచ్ఐవీ, టీబీ వంటి వ్యాధులు సంక్రమించే ప్రమాదాలు కూడా ఉన్నాయి.

తనిఖీలు చేయని పిసిబి

కాలుష్య నియంత్రణ మండలి సుప్తావస్థలోకి వెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో కనీస తనిఖీలు, బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాలనీలు, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణపై కాలుష్య నియంత్రణ మండలి నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆస్పత్రులు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, గృహ వ్యర్థాల డంపింగ్ యార్డుల్లో ర్యాండమ్ తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అప్పుడప్పుడు, అక్కడక్కడ తనిఖీలు చేస్తున్నారు తప్పితే పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదు.

ఫిర్యాదులొచ్చినా చర్యలు శూన్యం

గ్రేటర్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల నిర్వాహకులు జీవ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారని ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి జీవ వ్యర్థాలను సేకరించే వాహనాలకు లైసెన్సులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది తప్పితే వాటిని అన్ని రకాల ఆస్పత్రులు వినియోగించుకుంటున్నాయా..? లేదా..? అనేది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు నిరంతర తనిఖీలు చేపట్టి అత్యంత ప్రమాదకరమైన కాలుష్య, వ్యాధి కారకులను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మోడల్ స్కూల్ సంఘాల ఐక్య వేదిక ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఏర్పాటైంది. శనివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సంఘాల సమావేశాన్ని టిఎస్ఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ మోడల్ స్కూల్ సంఘాల ఐక్యవేదికను ఏర్పాటు చేశారు. స్టీరింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని ఆ సమావేశం డిమాండ్ చేసింది. నోషనల్ సర్వీస్, పెండింగ్ బకాయిల చెల్లింపు, కారుణ్య నియామకాలు చేపట్టాలనే అంశాలపై చర్చించింది. ఐక్య వేదిక రెండో సమావేశంలో కార్యాచరణను ప్రకటించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ విఠల్, ఎంఎస్‌యుటిఎ రాష్ట్ర అధ్యక్షులు టి అరవింద్ గోష్, ప్రధాన కార్యదర్శి సాజిద్, ఉపాధ్యక్షులు శివప్రసాద్, టిపియుఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, ఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రాంతికుమార్, సాత్విక్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, శ్రీనివాస్, జితేందర్, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టప్రకారం పరిహారం ఇవ్వాలి

- పిప్పల్‌కోటి నిర్వాసితులకు పరిహారం తగ్గింపు అన్యాయం..
- భూనిర్వాసితుల పక్షాన సిపిఎం పోరాటాలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఎడ్ల బండిపై ర్యాలీగా వెళ్తున్న జాన్‌వెస్లీ, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాజెక్టుల పేరుతో భూములు సేకరించి పరిహారం అందించడంలో భూనిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. నిర్మాణాలకు నిధులు పెంచుతూ రైతులకు పరిహారం చెల్లించేందుకు నిర్ణయించిన ధరను మాత్రం తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించి, పరిహారం కోసం పోరాటం చేస్తున్న రైతులకు ఆయన మద్దతు తెలిపారు. రైతుల పక్షాన సిపిఎం పోరాటాలు చేస్తోందని, రైతులకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టులో కోల్పోయిన భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ రింగ్‌రోడ్డు చుట్టూ ఏర్పాటు చేస్తున్న రైల్వేలైన్ కోసం భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం మార్కెట్ ధరకు మూడింతలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పిప్పల్‌కోటి భూనిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం అయితే.. ఎకరానికి రూ.కోటి 20లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కానీ రైతులు అడుగుతున్న రూ.18లక్షలు చెల్లించడానికి కూడా ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పరిహారం కోసం ఎదురు చూసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పరిహారం సాధించుకునేందుకు పోరాటాలు చేసేందుకు రైతులు ముందుకు రావాలని, రాష్ట్ర రాజధానిలోని ప్రజాభవన్ ముట్టడించి ప్రభుత్వం మెడలు వంచుదామని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం చెల్లించే వరకు పోరాటం ఆగదన్నారు.

జాన్‌వెస్లీకి భూనిర్వాసితుల ఘన స్వాగతం

గ్రామానికి చేరుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులకు రైతులు వర్షంలోనూ ఎడ్లబండితో ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా గ్రామ ముఖ్య కూడలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ముందు భూనిర్వాసిత రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం రిజర్వాయర్ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా సీనియర్ నాయకులు లంక రాఘవులు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఆగివున్న డిసిఎంను ఢీకొట్టిన ఆటో

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీ రోడ్డుపై ఆగి ఉన్న డిసిఎంను వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్, ఇద్దరు కార్మికులు మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. కందుకూరు సిఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం కుర్మిద్ద గ్రామానికి చెందిన కార్మికులు ప్రతిరోజూ ఆటోలో రావిరాల వద్ద ఉన్న క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీస్ కంపెనీకి వెళ్తారు. అక్కడ హౌస్ కీపర్‌లుగా పనిచేస్తుంటారు. రోజు మాదిరిగానే శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కుర్మిద్ద గ్రామానికి చెందిన సురిగి శ్రీనివాస్ (39) ఆటోలో పంది శ్రీధర్ (26), పంది సత్తెమ్మ (49)తోపాటు మొత్తం 13 మంది పని కోసం వెళ్లారు. రాత్రి పని ముగిసిన తర్వాత అదే ఆటోలో అందరూ గ్రామానికి బయలుదేరారు. ఎన్‌టిఆర్ తండా దాటిన తర్వాత డిసిఎం డ్రైవర్ మోసిన్‌ఖాన్ రోడ్డుపై వాహనం నిలిపాడు. ఎలాంటి సిగ్నల్ లేకుండా నిలపడంతోపాటు డిసిఎం వాహనంతోపాటు వెనకాల ఒక ఆర్ఎంపి పంపు (కాంక్రీటు పంపు) బండి తగిలించి ఉంది. అయితే ఆటో డ్రైవర్‌కు వర్షం.. చీకటి వల్ల రోడ్డుపై నిలిచి ఉన్న డిసిఎం వాహనం కనిపించకపోవడంతో వెనుక నుంచి ఆర్ఎంసీ పంపును ఢీకొట్టాడు. ఆటో ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సురిగి శ్రీనివాస్, కార్మికులు పంది శ్రీధర్, పంది సత్తమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణించిన పంది లింగమ్మ, పంది జంగమ్మ, పంది స్వరూప, పంది శాంతమ్మ, పంది హంసమ్మ, గోపాలి అరుణ, గోపాలి మంజులకు తీవ్ర గాయాలయ్యాయి. గోపాలి, పంది రేణుక, సిద్దిగారి లావణ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డిసిఎం డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపించారు.